# కథ

# తోడొకరుండిన...

డాక్టర్ యన్.రామచంద్ర

**ధ**నుంజయరెడ్డి అవివాహితుడు. సన్నిహితులు, ఆత్మీయులు ఎవరైనా "బెండకాయలా ముదిరిపోతున్నావు, ఇంకెప్పుడు పెళ్లి చేసుకుంటావ్?" అని అడిగితే చిన్నగా నవ్వి "నాకులేని తొందర మీకెందుకు? డా.సి.ఆర్.రెడ్డి నాకు ఆదర్శం. పెళ్లాడి మీరంతా సుఖంగా ఉన్నామని గుండెల మీద చేయి వేసుకుని చెప్పండి. పెళ్లి అనేప్పటికి ఒక పెళ్లామే మన వెంటరాదు, అత్త, మామ, బావమరదులు, మరదళ్ళు, ఆపైన బిడ్డలు, కొడుకులు, కోడళ్ళు, కూతుళ్ళు, అల్లుళ్ళు. అందరి సమస్యలూ మన సమస్యలే" అని దీర్ఘమైన ఉపన్యాసమిస్తాడు. అంతటితో ఆగక "ఏం! పక్షులూ, పశువులూ పెళ్ళి చేసుకున్నాయా? వాటి సంతతి పెరగలేదూ! ప్లేటో అనే గ్రీకు తత్త్వవేత్త పెళ్లి పెద్ద జంఝూటకమన్నాడు" ఇలా సాగుతుంది చర్చ.

నేను ఎస్.ఎస్.ఎల్.సి చదివే మొదటి రోజుల్లో హెడ్‌మాస్టర్‌గా మా హైస్కూలుకు బదిలీ మీద వచ్చాడు ఆయన. మాదే మొదటి బ్యాచి, స్కూలు పాలకవర్గం ప్రభుత్వంపై వత్తిడి తెచ్చి వేయించుకున్నారు. విచిత్రమేమిటంటే పరస్పర విరుద్ధమైన లెక్కలు, జీవశాస్త్రం ఆయన అభిమాన విషయాలు, జిల్లా వ్యాప్తంగా ఆయనకు మంచి పేరు టీచర్‌గా.

ఛార్జ్ తీసుకున్న రోజు గ్రామ పెద్దల్ని విద్యార్థుల తల్లిదండ్రుల్ని, ఉపాధ్యాయ వర్గాన్ని, విద్యార్థుల్ని ఉద్దేశించి చేసిన ఉపన్యాసం అర్థవంతమైనది. "నన్ను కోరి తెచ్చుకున్నందుకు నా సేవల వల్ల స్కూలుకు మేలు జరగాలి. స్కూల్ ఫైనల్ విద్యార్థులెవ్వరూ రాత్రి పదిగంటలకు ముందు పడుకుంటే తోలు తీస్తాను, అయిదుకు లేవకపోతే వాతలే. నేను నిద్రపోను, మిమ్మల్ని నిద్రపోనివ్వను. అలాంటి చదువు మంచి విజయానికి సోపానం. ఆ సమయంలో మెదడు తన అత్యుత్తమ సామర్థ్యాన్ని ప్రదర్శిస్తుంది. నాకు స్కూలు తప్ప మరే బాదర బందీ లేదు, మీకు చదువు తప్ప మరేమీ వద్దు" అని బాధ్యతల్ని గుర్తుచేసి ఆపైన మనిషి శరీరంలోని జీర్ణక్రియ గురించి చేసిన ఉపన్యాసానికి ప్రజలు నోళ్లు వెళ్ల బెట్టి విని పొగుడుకుంటూ ఇళ్లు చేరుకున్నారు. నాకు ఆయనపై గొప్ప భావమేర్పడింది. "సేవా ధర్మః పరమ గహనో యోగి నామప్యగమ్యః" సేవా ధర్మం చాలా గహనమైంది, యోగులకు సైతం అంతుబట్టదు అని నీతి శాస్త్రంలో చదువుకున్నాను.

నేను చదువులోనైతే ముందున్నాను గాని ఆర్థికంగా మా కుటుంబం చాలా వెనకవుంది. ఈ కారణంగా నా చదువుకు చాలా సార్లు ఆటంకాలు ఎదురయ్యాయి. నాన్న వ్యవసాయ కార్మికుడు. ఆయనే, ఆ యింటి ఆర్థిక పరిస్థితే పెద్ద ఆటంకం. నన్నూ పనిలో పెట్టాలని ఆయన,ససేమిరా అని అమ్మ–ఇలా ముందు వెనుకలుగా నట్టుతూ నా చదువు.

నాన్న బావి పనిలో గడ్డపార పట్టుకుంటే మడమ తిప్పని కార్మికుడు. బీడీకని కూడా ఒక్క క్షణం కూలి యజమానికి నష్టం రానివ్వడు. బావుల పనులు ఎండాకాలంలోనే. నాకూ సెలవులు కనుక నేనూ నాన్నతో పాటు కూలికి. బావి పూర్తికావచ్చి కట్టడం జరుగుతున్న దశలో ఒక పెద్దరాయి మోసుకువస్తూ గడ్డ దొర్లి బావిలో కుప్పగా ఉన్న రాళ్ళపై పడి నాన్న వెన్నుపూస విరిగింది. ఆస్పత్రులు తిరగలేక, రోగిని చంపుకోలేక, పూట గడవక అమ్మ అనుభవించిన నరకం ఎరిగిన వాణ్ణి. చదువుమాని కూలికిపోతానని నేనూ, వద్దని అమ్మ.

ఒకనాటి తెల్లవారుజామున హెడ్మాష్టర్ మా యింటికి వచ్చాడు. విద్యార్థులు లేచి చదువుతున్నారో లేదో అని ఆయన ఆ సమయంలో ఇల్లిల్లు గమనిస్తాడు, ఆ రోజు మా యింటికి. కిరోసిన్ బుడ్డి చిన్న ముక్కాలి పీట మీద పెట్టుకొని చదువుతూ ఆయన కంట పడ్డాను. దైవం దారి తప్పి మా కొట్టంలోకి రాక. మంచంలో మడత దుప్పటి చిరుగుల్లో చావుబతుకుల మధ్య నాన్న. అమ్మ సర్దుకొని అలా ఎడంగా, సిగ్గుగా, బాధగా, కృతజ్ఞతగా, మాటపెగలక, దైన్యాన్ని మూట కట్టుకొని, కళ్ళు నేలకు వేసి, ఏమ్మాట్లాడక, మాటలు రాక, దైవం ఎదుట మోకరిల్లినట్లు,

బహుశా నా భవిష్యత్తును ఆయన చేతుల్లో పెట్టి నీవే దిక్కు అన్నట్లు, విషయమంతా వివరంగా మౌన భాషలో వివరించినట్లు, మా నాన్న రెండు చేతుల్నీ కలిపి దండం లాంటిది పెట్టించింది. యాచనకై వెళ్లి కుచేలుడు సంకోచంతో తిరుగు ముఖం పట్టినా ఆంతర్యమెరిగిన శ్రీకృష్ణుడు సర్వం సమకూర్చినట్లు-ఆనాటి నుంచి నిశ్శబ్ద సాంత్వనం మా యింట. మరికొన్ని రోజులకే నాన్న కన్నుమూశాడు.

ఇంట్లో జరుగుబాటు మరింత దిగజారింది. అమ్మ ఏడు మాసాల వరకు బయట తిరగకూడదట. నవవైధవ్యం, చూడగానే అసహ్యించుకోవడం, అపశకునంలా భావించటం, ఏ పనికీ పిలవకపోవటం-అమ్మ అంటుంది "ఆడది చస్తే మగవాడికి ఏ సొంగ్యాలూ ఉండవు. బయటికి కనపడని మొలత్రాడు తెంచేసుకుంటాడు, మగవాడు పోతే ఆడదానికే అన్ని రకాలైన కట్టుబాట్లు, కడుపునింపుకునేందుకు కూలి పనికి కూడా ముండతనం అడ్డంకి" అని, "పొరుగూరుకు పోయి పాచి పనికి కుదిరి కడుపు నింపుకుందామా! నీ చదువు ఏమయిపోతుందో, ఇప్పటికిప్పుడు నీ చదువు కూలికి యెక్కువ ఉద్యోగానికి తక్కువ" అని లోలోన మథనపడుతుంది.

వేరుసెనగ పొలాల పాపనాలకాలం, రెండురోజులు స్కూలు ముఖం చూడలేదు. కట్టె యెదిరి ఓదెలుగా పెట్టటం. వరంబండికి ఎక్కించటం. దీనికి ఏ నైపుణ్యం అక్కరలేదు. పని చేస్తున్నానేకాని, శరీరం చేలో మనస్సు బడిలో నిబద్ధతలేని మొరటు పనిలోనూ లొసుగులు తప్పవు. శరీరం సలువుతో రాత్రి యిల్లు చేరుకున్నాను, వేడి నీళ్ళ స్నానంతో ఒళ్ళు తెలియని నిద్ర.

నట్టింట దీవం బుద్ధిలేని విద్యార్థిని మేల్కొలిపేందుకు తెల్లవారు జామున మాష్టారు పిలుపు, దయ్యం తొక్కినట్లు గాబరాగా లేచి దోషిగా నిలబడ్డాను. అమ్మ దైన్యస్థితి ఆ చీకట్లోనే పసికట్టి ఆయన చలించి పోయాడు. ఆయనకు మాట్లాడేందుకు ఏసాకూ దొరకలేదు.

"రెండు రోజులుగా క్లాసులో కనబడలేదే?" కోపంతోకాక దయగా. తలవంచుకు నిలబడ్డాను.

"నీవైనా చెప్పకూడదా!" అమ్మను ప్రశ్నించాడు.

"బడో, తిండో-ఏదో ఒకటి మానుకోవాలి, నాకడుపు ఎలాగూ కాలి బుగ్గి అయిపోయింది, వాడి పేగులకింత ధారకం కోసం కూలికి వెళ్లాడు". ఏదో గుహలోంచి మాట ప్రతిధ్వనించినట్లు, మాష్టారు చలించిపోయాడు.

"సాగే తీగ, తెగ్గోయవద్దు" కవరు తీసి నాచేతిలో, నేను అమ్మచేతిలో-మాష్టారు బయటికి వెళ్లిపోయాడు. అమ్మ చేతిలోని కవరులో కొంత పైకం. నెలనెలా ఇదే తంతు. అమ్మకు అశుద్ధ దినాలు గడిచిపోయాయి. పరీక్షల సమీపంలో నేను.


స్కూలు వాచ్‌మ్యాన్ చనిపోయాడని వార్త, మాష్టారుకు వండిపెట్టే చౌదయ్య, ఆయన కష్ట సుఖాలు చూచే బాధ్యత గలవ్యక్తి చౌదయ్య, అంత్యక్రియలు మాష్టారే జరిపించాడు. అమ్మ మాష్టారుకు భోజనం నాతో పంపింది. భర్త లేక అమ్మ, పెళ్ళే చేసుకోక మాష్టారు, తిండి వండిపెట్టే ఆసరా లేక ఆయన-చివరకు ఇలా నా ఋణం స్కూలు ఫైనల్ పరీక్షలు అయ్యేదాకా, ఆయన నాపై ప్రదర్శించిన అవ్యాజానురాగం, ఆత్మీయతలు-మా మధ్య విడదీయరాని అనుబంధం, ఇదే ఘటన అంటే, పరీక్షా ఫలితాలు స్కూలు ప్రథమ స్థానంలో నన్ను నిలిపాయి. మాష్టారు నమ్మికను వమ్ము పరచలేదు.

పాఠశాల కమిటీతో మాట్లాడి చౌదయ్య స్థానాన్ని అమ్మతో భర్తీ చేయించాడు మాష్టారు. విజయవాడ లయోలాలో పియుసి యం.పి.సి లో సీటు ఏర్పాటు చేయించాడు. ఫీజులు, పుస్తకాలు, దుస్తులు, పైఖర్చులు అమ్మ జీతం మాష్టారి సహకారం- ఎంత మార్పు? ఆ ఆపన్న హస్తం దైవ దత్తం. కిందుమీదుల చక్ర భ్రమణంలోనే జీవితం మలుపులు దాగి ఉంటాయి కాబోలు! మానవత్వపు పరిమళాలు వెదజల్లబడిన చోటే ఈ సంఘటనలు సంభవం.

అమ్మను చూడాలని ఉన్నా, ఆ కళాశాల నియమాలు, నిబంధనలు పద్ధతులు ఒప్పుకోవు. ఆమె కళ్ళలో వెలుగు చూడాలంటే నా బాధ్యతా నిర్వహణలో ఎక్కడా ప్రమత్తత పనికిరాదు. పీనుగులాంటి మనిషిని మంచంలో ఉంచి ఎన్ని నిద్రలు లేని రాత్రులు గడిపిందో? ఒక తీపి నమ్మకం నాపై పెంచుకొని విధితో పోరాడింది. బతకదని తెలిసి బతికున్నంత వరకు, ఒక ప్రక్క, ఒకే పక్క శరీరమంతా పుండ్లతో అట్టలు కట్టి, దుర్వాసనలు పీలుస్తూ చీకటి మాటున దుఃఖాన్ని మింగుతూ, కనుచూపుమేరలో మృత్యువు కదలాడుతున్నా సడలని ఓరిమితో అనుభవించిన వాళ్ళకే ఆ అనుభవంలోని బాధామయం ఆర్ద్రత తెలుస్తుంది. బ్రతుక్కు డబ్బే ఒక ఉపాయనమైన చోట, ప్రేమ, బాంధవ్యం తుచ్ఛమై తలవంచిన చోట అమ్మ ఒక జీవచ్ఛవం, నాన్నది శవప్రాయ జీవనం.

ఇప్పుడు అమ్మను చూడకపోయినా, ఆమెలో, నాలో ప్రవహిస్తున్న ఒక బలీయమైన రక్తబంధం సహనాన్ని కోల్పోదు. చివరి కంటా సాగిపోకుండా మధ్యలోనే ఆగిపోయే బ్రతుకులకు ఎవరు జవాబుదారీ? నాన్నకు అలా జరుగుతుందనియెలా తెలుస్తుంది? ప్రతి కార్యానికి ముందు వెనుకలు తెలియని యాదృచ్ఛికత ఒకటి పనిచేస్తూంటుంది. అలాంటిదే ధనంజయరెడ్డి మా కుటుంబంతో కలవడం. ఋణానుబంధం- ఇత్యాదుల్ని నేను సమర్థించుకోలేను, మళ్లీ జన్మ అనేది ఏ హేతువుకు నిలబడదు.

ఆ వేళ లయోలాలో కేంద్ర మంత్రి ఉపాన్యాసం. ఈ సంస్థలో ఇలాంటి సభలు మామూలే. కేవలం పాఠాలకే పరిమితంగాక నిష్ణాతులైన వ్యక్తులతో పరిచయాలు కల్పించి వాళ్ళ ప్రభావం కొంతైనా విద్యార్థులపై పని చెయ్యాలని మా ప్రిన్సిపాల్



సహజసాహితి, చీరాలవారి సాహితీ వసంతోత్సవ సభలో లబ్ధప్రతిష్ఠులైన సాహితీ ప్రముఖుల చేతులమీదుగా "సాహితీ విశారద" బిరుదును స్వీకరిస్తున్న శ్రీమతి పాతూరి అన్నపూర్ణ. చిత్రంలో ఆచార్య అప్పాజోస్యుల సత్యన్నారాయణ, అద్దేపల్లి రామమోహనరావు, బి. హనుమారెడ్డి, వడలి రాధాకృష్ణ, పొన్నూరు వేంకట శ్రీనివాసులు, ఎం.ఆర్.వి. సత్యన్నారాయణమూర్తి.

ఆశయం. ఆయన ఒక ప్రయోగశీలి. విద్యార్థులు విధిగా హాజరుకావాలి.

నా సీటు ప్రక్కన డిగ్రీ ఫైనల్ విద్యార్థి కూర్చున్నాడు. మంత్రి రాకకు మరికొంత ఆలస్యం ఉందని ప్రకటన. తన్ను తాను పరిచయం చేసుకుంటూ నా వివరాలడిగాడు. పదిమైళ్ల దూరంలో మా యిరువురివి కాలిగట్టు గ్రామాలు. మా వూరు మునివాడ. మంచి జనాభా గల పెద్ద వూరే. అందుకే ఆ వూళ్ళో హైస్కూలు, తదితర ఆఫీసులు. అతనిది చిన్న వూరు, పులికుంట మేనమామ గారి ఊరు కొణితివాడ హైస్కూల్లో చదివాడట. మాటల సందర్భాన మా హెడ్మాష్టరు వ్యక్తిత్వం ఆయన ఔదార్యం, ఉద్యోగం పట్ల అంకిత భావం నేను కొంత ప్రశంసా ధోరణిలో వివరించాను. అతని తదేకదృష్టి నన్ను ఆకట్టుకుంది.

"ధనంజయరెడ్డి అంటే ఎర్రగా, బారుగా, అందంగా, గుబురు మీసాలు, ఎప్పుడూ ఇస్త్రీ నలగని తెల్ల దుస్తులు, బంగారు కళ్ళజోడు, మంచి ఆకర్షణ గల తెలుపు రంగూ" అంటూ వర్ణించాడు. ఎంతో సన్నిహితంగా ఉంటే తప్ప మనిషిని ఇంత బాగా అంచనా వెయ్యడం కుదరదు.

"మీకెలా తెలుసు? బంధువా?" ఉత్కంఠగా అడిగా.

ఆయన తెలియందెవరికీ? మ... హా... ను... భా...వు...డు సుఖ పురుషుడు అంటూ పేరును చీల్చి చీల్చి పలికాడు, మనిషిని కూడా అలాగే చీల్చే ధోరణి అతని విరుపుడు మాటల్లో, గేలితనంలో, తక్కువ చేసి మాట్లాడ్డంలో పసిగట్టాను. ఒక వ్యక్తిని ఒక్కొక్కరు ఒక్కో దృష్టితో చూస్తారు. ఏకాభిప్రాయం సామాన్యంగాదు. అందరూ నాలాగే, లేక తనలాగే అంగీకరించాలని యెక్కడుంది?

"అయితే మీకు బాగా తెలుసన్నమాట!"

"తెలుసేమిటి? బహుశ నేను చదివిన స్కూలు నుంచి మీ వూరికే బదిలీ మీద వచ్చాడనుకుంటా! అట్లా అనే కంటే తప్పించుకు వచ్చాడంటే బాగుంటుంది. నాకూ అంతగా విషయ గ్రహణశక్తి లేదుగాని, అతనొక పక్కా వ్యభిచారి, ముసుగులోనే వ్యవహార మంతా నడిపిస్తాడని.

"ముసుగంటే?"

"పిల్లల్ని చదివిస్తానని, నిద్రలేపుతానని, చిన్న చిన్న తాయిలాలతో ఇంటి యజమాని ఆసరా సాధించి ఆడవాళ్ళను వశం చేసుకోవడం ఆయన యుక్తి. రైతులు పొద్దున్నే పొలాలకు పోగా తన కైవాడం పని చేస్తుంది.

"తాయిలాలంటే"?

"ఆర్థిక సహాయం, పుస్తకాలు, పెన్నులు, ఫీజులు– ఒకటేమిటి? గృహస్థుల అవసరాల్ని ఇట్టే పట్టెయ్య గలడని" "స్త్రీలు అంత బలహీనులా? నువ్వు చెప్పేది వింటే వ్యవస్థకు పూర్తిగా చెదలు పట్టిందను కోవాలి. వినికిడి జ్ఞానమా, స్వానుభవమా?"

నదురూ నాణెం ఎరుగని పల్లె స్త్రీలు ఒక విద్యావంతుని, తమ బిడ్డలకు జ్ఞాన దానం చేసే గొప్ప వ్యక్తి కోరికను ఎందరు తిరస్కరిస్తారు? ఇందుకు వివరణలు, విశ్లేషణలూ వద్దు. మరీ అంతగా తడిమితే ఎలా? అన్ని విషయాలు బహిర్గతం చెయ్యలేం గదా!"

గాలిలో దీపంలా నామనస్సు కొట్టుకులాడింది. ముసుగు తాయిలం–వశం–ఈ పదాల్లో ఎక్కడో కొంత వెలితి ధ్వనించదముంది. ప్రత్యక్ష సహకారం, పరోక్షంగా ఊహకందని చర్య. అయినా ఇతని మాటల్ని నమ్మాలని ఏముంది? ఎంత సరిపెట్టుకొన్నా హృదయంలో ప్రవేశించిన భూతాన్ని తోలెయ్యలేక పోతున్నాననిపించింది.

ఇతడుకాని, ఇతడిలాంటి లోకులు గాని హెడ్మాష్టర్ చేస్తున్న మంచిని, వాళ్ళనుకుంటున్న చెడుని తులలో తూచలేరా? ఒకవేళ ఆయన చేస్తున్నాడనుకొంటున్న దాన్ని మనం భూతద్దంలో చూడవలసిన అవసరముందా?

ఎన్నో పాపాలు చేసిన కావ్యనాయకులు గుణ నిధి, నిగమ శర్మ, సుకుమారుడు ఎలా ముక్తిని సాధించగలిగారు? నీతుల్ని ఉపదేశించే కావ్యాలు ఇలాంటి పాప పరిహారాల్ని కావ్య నాయకులకే పరిమితం చెయ్యడం ఎంత వరకు సమర్ధనీయం? ఎంత సరిపెట్టుకున్నా అంతరాంతరాల్లో కెలకడం తగ్గలేదు. ధర్మశాస్త్రాల నిర్దేశాలు ఎంతటి వాణ్ణి కట్టి పడవేస్తాయి కాబోలు!

అమ్మను చూడాలనిపించింది. ఆమె అగ్నిగుండంలో పడకుండా వారించాలనిపించింది. వ్యవస్థ బలమది. అనుమానాల పాపచ్ఛాయల వెంట పరుగుదీస్తే, నేనేమవ్వాలి? నా వ్యక్తిత్వాన్ని ఎలా కించపరుచుకోవాలి? నాహేతుత్వ దృష్టిని యెలా అణచి పెట్టాలి? అసలు స్త్రీనే యెందుకిలా బాధ్యురాల్ని చెయ్యాలి?

కేంద్రమంత్రి చేస్తున్న ప్రసంగం నా, అప్రస్తుత అనుమానపు నీడల చాటున అధిగమించి వెలుగును నింపలేకపోయాయి. స్థాణువునైపోయాను. నాప్రక్కన కూర్చున్న విద్యార్థి మరో చోటికి ఎప్పుడు జరిగాడో తెలియదు. నాలో ఏ విధమైన అనుమానమో, అల్పత్వమో, అజ్ఞానపు పొరలో ఇంకా వెదదును తొల్చకపోతే ఇప్పటికిప్పుడు అమ్మను చూడాలనే దుగ్ద ఎందుకు? పాలలో తోడి వేసినట్లు ఎంత స్వచ్ఛమైన, దృఢమైన మనసైనా క్షణంలో కలుషితం గావడం సంప్రదాయ దుష్టఛాయగాక మరేమిటి?

కేంద్రమంత్రి ఉపన్యాసమయిపోయి తిరుగుముఖంలో వున్న శ్రోతలు, నేనేమో తర్జన భర్జనల మధ్య ఏం విన్నానో? ఒక చిన్న పరిచయం నాలో ఎన్ని ప్రకంపనల్ని సృష్టించింది? నాగరికత ఎంతగా ఎదిగినా మనిషి కుబ్జ రూపం మారకపోవడం వింతే.

పాము ఒక్కచోట కాటువేసినా విషం శరీరమంతా పాకుతుంది. అలాగే అనుమానం కూడా, రానురాను పెనుభూతమై జడిపిస్తుంది. పరీక్షలయిపోయాయి. ఇంటి మీద గాలి అనే కంటే అమ్మ మీద వాలిన నీలినీడలు, మాష్టారు జీవనశైలి నన్ను తరిమింది. ఒకవేళ అతడు అంటించిన నిప్పు ఎంత వరకు వ్యాపించిందో?

అయినా ఏమి జరిగింది గనుక మధన పడుతున్నాను? ఆ వూళ్ళో మాదొక్కటే కుటుంబమా? అందరికీ యిదే పరిస్థితా? పున్నమి నాటి చంద్రుడు సరోవరంలోలా నిశ్చలంగా, సన్యాసినిలా నిరాడంబరంగా, యోగినిలా నిర్భరతతో దర్శనమిచ్చింది అమ్మ. నా గుండెల్లో చెలరేగుతున్న అనుమాన పిశాచమే నా తల్లి వద్ద ప్రేమగా, ఆప్యాయంగా, నిష్కల్మషంగా ఉండనివ్వలేదు. అవేకళ్ళు–ఎదుటి నుండి సానుభూతి పిండుకొనే అదే దైన్యం, అశక్తతను తరిమికొట్టే అదే ధైర్యం–నా తల్లి నిప్పు.

"పరీక్షలు బాగా రాశావా?"

**విజ్ఞప్తి**

**రచయితలు తమ రచనతోపాటు హామీపత్రాన్ని విధిగా జతచేసి పంపవలెను. అట్లు జతచేయని రచనలు పత్రికలో ప్రచురణకు స్వీకరించబడవు.**

అమ్మ. ఆ ప్రశ్నలో ఎన్నో అర్థాలు నీపై బోలెడు ఆశలు, స్వతంత్రంగా బ్రతికే భరోసా, నీ ఆనందమే నా ఆనందమనే దిలాసా, నీవు ఇంతై, అంతై నాకందనంత ఎత్తు ఎదిగి, నా నోముల్ని పండించేంత వాడవు కావాలన్న ఆమె ఆశను నింపుకున్న ప్రశ్న అది. "నీవెలా వున్నావు?" అని అడగాలని వుంది.

అమ్మ శీలాన్ని శంకించి, మాష్టారు వికృత చేష్టల్ని మననం చేసుకుని నేనెంత తప్పు చేశాను? ఒకరు బ్రతుకునిస్తే, మరొకరు బ్రతుకుతెరువునిస్తూంటే ఎందుకు నాలో ఈ విష బీజాలు? నన్నిలా నిర్నిద్రుణ్ణి చేసిన అతణ్ణి ఆనాడే ఎందుకు నిలదీయలేకపోయాను? నాలోను అల్పత్వం దాగివుండాలి. నాతోపాటు స్కూల్లో చదివిన విద్యార్థులందరికీ పలకరింపులకు కలిశాను. ఎక్కడా అంతర్గత ప్రశ్నకు సమాధానం దొరకలేదు. నాకులాగా వాళ్ళకెవరికీ మెదళ్ళను కెలికే కుసంస్కారులు తగిలివుండరు.

"ఒక్కసారి మాష్టర్ను కలిసిరాకపోయావా? ప్రతిదినం నీ గురించి ఆయన ఆలోచిస్తూ ఉంటారు" అమ్మ.

"ప్రతి దినం" మాట నన్ను మళ్ళీ ఆలోచనలతో కుదిపింది. మాష్టరు ఎలాంటి వాడో ఎవడో చెప్పాడు, ఎలాంటి మనస్తత్వమున్నవాడో నేను స్వయంగా గుర్తించిన వాణ్ణి, కృతజ్ఞత లేకపోతే మనిషేకాదు, అమ్మ చెప్పిందని కాక నేనే సమక్ష కావడం విధి.

మాష్టరు ఎదుట పడగానే తడబాటు వచ్చింది, నమస్కరించాను-ఆయన మూర్తి మత్వమలాంటిది, నమస్కరించకుండా ఎవరూ తప్పుకోలేరు. నా కళ్ళను కప్పివున్న అనుమానపు పొరలు ఆయన గుర్తించి ఉంటాడా?

నేను ఊహించినట్లే ఆయన కూడా ఊహించాలని ఎక్కడ ఉంది? చేయూతనిచ్చే వ్యక్తి ముందు త్రికరణ శుద్ధిగా మోకరిల్లక ఈ శషభిష లెందుకు? అద్దం మీద మసక పులిమితే నా ముఖమెలా స్వచ్ఛంగా కనబడుతుంది?

"ఇంజనీరింగ్‌లో చేరేందుకు దరఖాస్తు ఫారం తెప్పించాను, మార్క్సు రాగానే నింపి పంపు. తమిళనాడులోని మేళ్ మరవత్తూర్ కాలేజి, మంచి పేరున్నది. నిన్ను మంచి ఇంజనీర్‌గా చూడాలని మీ అమ్మ ఆరాటం" మాష్టర్.

అమ్మ ప్రసక్తితో మనసులో మళ్ళీ కుళ్ళు లేచింది. అమ్మ తలంపైనా ఆయన నోటి నుండి రావడం నాలో అలజడికి కారణం. ఎందుకిలా ఈ జాడ్యం నన్ను వెంటాడుతోంది? స్త్రీ భావనకే ఎందుకిన్ని సంకెళ్ళు? నా తల్లిని మినహాయించి చూడటంలో నా నిజాయితి ఎక్కడ ఏడ్చింది?

సెలవు తీసుకుని ఇల్లుచేరి "అమ్మా! నేను ఇంజనీరు కాకపోతే యేం? మామూలు చదువుకు ఏ చిన్న ఉద్యోగమో రాదా?" అన్నాను.

"నీవు ఇంజనీరు కావాలని ఎవ్వరన్నారు?"

"మాష్టారన్నారు, నీ మనసులోని మాటా, లేక ఆయన కల్పనా?"

"ఏం! నీకు మాత్రం లేదా? మరెందుకు అంత పట్టుదలగా చదవటం? ఎవరో అన్నారనో ఎందుకు, కొన్ని కోరుకున్నానని జరగవు, కోరుకోకపోయినా కొన్ని జరిగేందుకు అవకాశాలుంటాయి."

'అవకాశం' అనే మాట మళ్ళీ ఆలోచనల్లో దింపింది. మాష్టారు ఈ అవకాశం కల్పించడంలోని ఆంతర్యమేమిటి? నిష్కామ కర్మా? దే... ని...కై...నా ప్రతిఫలమా? అమ్మ ఆలోచన కూడా అటే లాక్కుపోతోందేమో?

మనోబలం అన్ని చోట్లా పని చేయదని పించింది. కొన్ని పనులు వ్యక్తి యిష్టాయిష్టాల ప్రమేయంతో కాక తమంతకు తాము జరిగిపోవడముంది. బలహీనుడు విధి అంటాడు, మనోధైర్యం గలవాడు ఒప్పుకోడు, ప్రతిఘటనకు కార్యకారణ సంబంధాల్ని వెదకాలనుకోడు. ఎప్పటికెయ్యది ప్రస్తుతం అప్పటికది అంతే.

ఇంజనీరింగ్‌లో చేరాను. ఎంత సమయం కేటాయించినా తక్కువే, అంతా పోటీతత్వం. ఎవడికి వాడు ముందుకు పరుగెత్తాలని. కాలానిదేముంది, మంచికీ-చెడుకూ దానిది ఒకే పరుగు. నాలుగేళ్ళు గడిచిపోయాయి. క్యాంపస్ సెలక్షన్, మంచి కంపెనీ, జీవితానికి ఒక స్థిరత్వం. అమ్మ వ్యక్తిత్వాన్ని అనుమానించే ఏ సంఘటననూ అంగీకరించని దృఢత్వం అలవరచుకొన్నాను.

కంపెనీ ఇచ్చే ట్రైనింగ్ పూర్తికావచ్చే దశలో ఇంటి నుంచి ఉత్తరం. మొత్తం నా విద్యార్జనా దశలో అమ్మ నుంచి అందుకున్న మొట్టమొదటి ఉత్తరం. కీడును శంకించి మనస్సు అల్లకల్లోలమయింది. ఉత్తరం సారాంశం "ఒక్కసారివచ్చిపో".

మాష్టారు సంవత్సరం క్రితం పదవీ విరమణ చేసినట్లు తెలుసు. బహుశ విశ్రాంతి కొరకు ఏదైనా ఆశ్రమానికి వెళ్ళే ఆలోచన ఉండవచ్చు. నన్నూ, నా పరిస్థితుల్ని గమనించిన క్షణం ఎంతటి ఉజ్జ్వలమైందోగాని, రక్తం పంచి యిచ్చిన తండ్రిలో కూడా ఇంతటి బాధ్యతాయుతమైన సంరక్షణను ఊహించలేను. ఒక ఉపాధ్యాయుడు తన విద్యార్థి భవిష్యత్తుపై పూర్తి సంరక్షణ తీసుకొని నిష్కామంగా జీవిక కల్పించడం అరుదు. ఇప్పుడు అమ్మను చూడాలనే తహతహ కంటే మాష్టారును చూడాలనే కోర్కె బలీయంగా వుంది. నాకై, నా లోభత్వంతో, నా అజ్ఞానంతో యెన్ని నిందలు మోశాడో?

మృత్యువు పిలుపుకు సన్నద్ధమయిన మాష్టరు కంకాళం. తల క్రింద దాచి వున్న కొన్ని కాగితాల బొత్తి నాచేతిలో వుంచి కన్నుమూశాడు. క్షణాల్లో ఊరంతా పాకింది. మా పాకంతా పూలదండల దొంతర్లు. పాఠశాలను, ఊరిని, కొన్ని వందల మంది ప్రయోజకులైన విద్యావంతుల కన్నీటిని గెల్చుకున్న మాష్టారు శవయాత్ర. సంస్కారాలు నిర్వహించే అదృష్టం నాకు. నా అనుమాన పిశాచాల్ని కాష్టంలో కాల్చి కుబుసం వదిలించుకున్న సర్పంలా పరిశుద్ధతతో శోకమూర్తి అమ్మను చేరుకున్నాను. నాజీవితమనే చెట్టు పాదులో అమృతం నింపిన మాష్టారి గుర్తులు చెరిగిపోయాయి.

పెళ్ళే లేని వ్యక్తికి ఏముంటుంది కర్మకాండ?

చెక్క పెట్టెలో దాచివుంచిన కాగితాల బొత్తిని విప్పిచూశాను. పెన్షన్‌కు పెట్టుకొన్న దరఖాస్తులో మాష్టారు ప్రక్కన పట్టణంలో అయిదు సెంట్ల ఇంటి స్థలం డాక్యుమెంట్స్. మాష్టర్ సర్వీస్ బుక్.

ఆయన పెన్షన్‌కు అమ్మ, ఆస్తికి వారసులమా? ఏ గుడికో, గోపురానికో కాక తన హృదయాన్ని పరిచి నడిపించిన, దీపం కొడిగట్ట కుండా ఎప్పటికప్పుడు అంజలిని అడ్డుగా ఉంచి కాపాడుకొన్న అమ్మను వారసురాల్ని చేయడంలో ఆయనలో అవిచ్ఛిన్నంగా ప్రవహించే మానవతా స్పర్శ, నాకై, నా ఉన్నతికై అహర్నిశలు కన్నీరు కార్చే అమ్మనెంతగా సాంత్వన పరిచాడో త్యాగమంటే ఏది? ఎవరిది? సుడిగాలికి కొట్టుకొని వచ్చిన ధూళి శకలంలో ఇంత వజ్ర సంకల్పం! "అమ్మా! నాకెందుకీ పెద్ద చదువులు" అన్నావే, బాబూ! ఈ ఇంట దీపాన్ని వెలిగించి కడకంటా కాపాడింది ఆయనే. నీ ముఖంలో నేను పసిగట్టిన అసహ్యపు అనుమానాలకు, నీవిచ్చే శిక్ష ఏదైనా సంతోషంగా భరిస్తాను, ఒక పవిత్రమూర్తి, ఆత్మీయ స్పర్శతో నాకబ్బిన "సంస్కార"వంతమైన మనస్సుతో...